# చేతిపంపు పనిచేయదు.. వైకుంఠ రథం కదలదు





జమ్మికుంట: మండలంలోని మడిపల్లి శ్మశానవాటిక వద్ద చేతిపంపు నాలుగు నెలలుగా పని చేయడం లేదు. చనిపోయిన వారి బంధువులు స్నానాల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నెలల తరబడి చేతిపంపు పని చేయకుండా ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని దీంతో అంత్యక్రియల సమయంలో మృతుల బంధువులు అవస్థలుపడుతున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దృష్టి సారించి మరమ్మతు చేయించాలని కోరుతున్నారు.

ఎంపీడీవో కార్యాలయం ఆవరణలోని వైకుంఠరథం ఏ గ్రామానికి కేటాయించకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, రూ.లక్షలు పెట్టి కొనుగోలు చేసిన వాహనం ఏటూ కదలకుండా అక్కడే ఉండటంతో తుప్పు పడుతోందని సీపీఎం మండల సహాయ కార్యదర్శి వడ్లూరి కిషోర్ ఆరోపించారు. శనివారం పట్టణంలో మాట్లాడారు. ప్రజాధనంతో కొనుగోలు చేసి వినియోగించకుండా మూలనపడేశారని, అధికారులు పట్టనట్టు ఉంటున్నారని, కలెక్టర్ చొరవ తీసుకోవాలని కోరారు.



సైదాపూర్: గర్రెపల్లి – సైదాపూర్ రోడ్డు మధ్యలోని వాగులో బ్రిడ్జి నిర్మించి ఇరువైపులా మట్టిపోశారు. గత వానాకాలంలో భారీవర్షాలకు బ్రిడ్జికి ఇరువైపులా మట్టిరోడ్డు తెగిపోయింది. మళ్లీ వర్షాకాలం వస్తే మట్టి కొట్టుకుపోతుందని, బ్రిడ్జికి ఇరువైపులా రోడ్డు నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
మాజిద్, పంచాయతీరాజ్ ఏఈ , సెల్: 8978598588

## వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

## క్లుప్తంగా

### పెసరిపల్లెలో చేపల విక్రయ కేంద్రం ప్రారంభం



చేపల విక్రయకేంద్రాన్ని ప్రారంభిస్తున్న జయప్రకాశ్

చిగురుమామిడి: మండలంలోని సుందరగిరి గ్రామ పరిధి పెసరిపల్లెలో చేపల విక్రయ కేంద్రాన్ని ఫిషరీస్ క్లస్టర్ ఇన్‌చార్జి ఎస్. జయప్రకాశ్ శనివారం ప్రారంభించారు. పెద్దమ్మతల్లి చేపల ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్, నాబార్డు సహకారంతో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మార్కెట్‌లో కొరమీను, రవ్వు, బొచ్చె, బంగారు తీగలాంటి చేపలకు మంచి డిమాండ్ ఉందన్నారు. కార్యక్రమంలో పెసరి రాజు, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు గండె సంతోష్, కొమురయ్య, ఐలేష్, సదానందం, లింగయ్య, రెడ్డి మల్లేశ్, రాజు పలువురు పాల్గొన్నారు.

### కిట్స్ కళాశాలలో అడ్వాన్స్ లీడర్‌షిప్ క్యాంప్

హుజూరాబాద్: మండలంలోని సింగాపూర్ గ్రామం కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో తెలంగాణ ఆంధ్రప్రదేశ్ నేషనల్ కెడేట్ క్రాప్స్ (ఎన్‌సీసీ) డైరెక్టరేట్ ఆధ్వర్యంలో ఎన్‌సీసీ క్యాడెట్లకు జాతీయ స్థాయి అడ్వాన్స్ లీడర్‌షిప్ క్యాంప్‌ను నిర్వహిస్తున్నట్లు కరీంనగర్ లెఫ్టినెంట్ కల్నల్ జయంత్ శనివారం ప్రకటనలో తెలిపారు. ఈ నెల 14 నుంచి 25వ తేదీ వరకు క్యాంపు జరగనుందని, శిక్షణ శిబిరంలో ఎన్‌సీసీ క్యాడెట్లకు భారత సాయుధ దళాలలో ప్రవేశానికి కావాలిన్న శిక్షణ ఇస్తారన్నారు. శిక్షణ శిబిరంలో మహారాష్ట్ర, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి బాలబాలికలు 310 శిక్షణ తీసుకుంటారని, తెలంగాణ నుంచి కరీంనగర్, జగిత్యాల్య, పెద్దపల్లి జిల్లాల నుంచి వచ్చే విద్యార్థులకు అన్యువల్ ట్రైనింగ్ క్యాంప్ మే 16 నుంచి 25వ తేదీ వరకు నిర్వహిస్తామన్నారు. క్యాంపులో దాదాపు 350 మంది క్యాడెట్లు పాల్గొంటున్నారని తెలిపారు. శిక్షణ శిబిరంలో పర్సనాలిటీ డెవలప్‌మెంట్ లీడర్‌షిఫ్ క్వాలిటీస్, ఫైరింగ్, మ్యాప్ రీడింగ్, ఫీల్డ్ క్రాఫ్ట్ టూ బాటిల్ క్రాఫ్ట్ తదితర వాటిల్లో శిక్షణ ఇస్తామన్నారు.


### రికార్డుల పరిశీలన



రికార్డులు పరిశీలిస్తున్న డీఐవో సాజిదా

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి సాజిదా తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వ్యాక్సిన్ భద్రపర్చేగదిని పరిశీలించారు ల్యాబ్, లేబర్‌రూం, రికార్డులు పరిశీలించి వైద్యాధికారి శ్రావణ్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు.

### వాహనాల తనిఖీ



మానకొండూర్: మానకొండూర్ మండల కేంద్రంలోని తూర్పుదర్వాజా, పల్లెమీద బస్టాండ్ వద్ద మానకొండూర్ సీఐ ఆధ్వర్యంలో పోలీసులు శనివారం రాత్రి వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. వాహనాలకు సంబంధించిన పత్రాలతో పాటు డ్రైవింగ్ లైసెన్స్, వివిధ రకాల పత్రాలను పరిశీలించారు. సీఐ సంజీవ్ మాట్లాడుతూ.. వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడపొద్దని, మితిమీరిన వేగంతో వెళ్లకూడదన్నారు. వాహనాలతో పాటు డ్రైవింగ్ లైసెన్స్‌లు కూడా కలిగి ఉండాలని సూచించారు.

## సైనికులకు మద్దతుగా క్రీడాకారుల ర్యాలీ



హుజూరాబాద్‌లో జవాన్లకు మద్దతుగా నినాదాలు చేస్తున్న క్రీడాకారులు

హుజూరాబాద్: పాకిస్తాన్ ఉగ్రవాదులపై దాడులు చేస్తూ దేశాన్ని కాపాడుతున్న జవానులకు మద్దతుగా శనివారం రాత్రి పట్టణంలో హాకీ క్రీడాకారులు భారీ ర్యాలీ నిర్వహించారు. హైస్కూల్ గ్రౌండ్ నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీగా వచ్చి మానవహారంగా ఏర్పడి జవానులకు మద్దతుగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో హాకీ అసోసియేషన్ అధ్యక్షుడు తోట రాజేంద్రప్రసాద్, జిల్లా అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బండ శ్రీనివాస్, మాజీ అధ్యక్షులు కొలిపాక శ్రీనివాస్, తిరుపతి, భూసారపు శంకర్, కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు తాళ్లపల్లి శ్రీనివాస్, శ్రీధర్, తాళ్లపల్లి రమేష్, హరి ప్రసాద్, పీఈటీ రవి కుమార్, సాయి కృష్ణ, విక్రమ్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## నల్ల బ్యాడ్జీలతో నిరసన



నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

హుజూరాబాద్: సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనంజయ రెడ్డి ఇంటిపై పోలీసుల దాడి హేయమైన చర్య అని టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని జర్నలిస్టులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ప్రజాస్వామ్యంలో జర్నలిజం మూల స్తంభం లాంటిదని, ఎలాంటి సెర్చ్ వారెంట్ లేకుండా ఏపీ పోలీసులు దాడి చేయడం ఏంటని ప్రశ్నించారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పాత్రికేయులపై దాడులు మానుకోవాలని లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జర్నలిస్టు సంఘ జిల్లా నాయకులు నంబి భరణికుమార్, హుజురాబాద్ ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి కామని రవీందర్,చిరుకమారి సత్యరాజ్, శ్రీనివాస్, చందు, రమేష్, శ్రీధర్, రాజలింగం, ఎం. కిరణ్, సాగర్, అజీమ్, సాయిలు, ఫహీం, రాజు, రజనీకాంత్, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఆలయాల్లో ప్రత్యేక పూజలు



చొప్పదండి: పూజలు చేస్తున్న బీజేపీ నాయకులు

హుజూరాబాద్: ఆపరేషన్ సిందూర్‌లో పోరాడుతున్న త్రివిధ దళాలకు మద్దతుగా శనివారం పట్టణంలోని శ్రీహనుమాన్‌స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు అవధానుల భాస్కరశర్మ ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. ఇది యుద్ధం కాదని ధర్మం, దేశ గౌరవ పోరాటని, మన ఐక్యత, దేశభక్తి ప్రపంచానికి తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ శంకర్, ఈవో ధర్మకర్తలు, ఆలయ సిబ్బంది, హనుమాన్ దీక్షాపరులు, భక్తులు పాల్గొన్నారు.

చొప్పదండి: పట్టణంలోని భక్త హనుమాన్ దేవాలయంలో బీజేపీ పట్టణ ఆధ్వర్యంలో శనివారం ఆపరేషన్ సిందూర్ విజయవంతమైందని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి చేపూరి సత్యనారాయణ, నాయకులు బత్తిని ప్రశాంత్, రాజన్నల రాజు, గుండేటి శివశంకర్, జిట్ట కుమార్, చల్ల అనూష్, అర్ధవెల్లి శ్రీనివాస్, తాడూరి రమణాచారి, గోపి, రాకేశ్, చందు పాల్గొన్నారు.

**హనుమాన్ భక్తుల పూజలు**


రామడుగు: మండలంలోని వెదిర శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయం, శ్రీరాజరాజేశ్వర స్వామి, శ్రీపంచముఖ ఆంజనేయస్వామి దేవాలయాల్లో హనుమాన్ స్వాములు శనివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు స్వాములకు అన్నవితరణ చేశారు.

## అప్పు చెల్లించడంలేదని ఆత్మహత్యాయత్నం



సమ్మయ్యను ఆసుపత్రికి తీసుకెళ్తున్న కుటుంబీకులు

శంకరపట్నం: బాకీ డబ్బుల వసూళ్ల కోసం పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని కన్నాపూర్‌లో శనివారం జరిగింది. గ్రామానికి చెందిన మర్రి సమ్మయ్య ఇదే గ్రామానికి చెందిన దొనపాటి మురళీధర్‌రెడ్డి అనే రైతుకు రూ.రెండు లక్షల అప్పు ఇచ్చాడు. అప్పు డబ్బులు చెల్లించాలని ఆ రైతు పండించిన ధాన్యం బస్తాలను సమ్మయ్య తన బంధువుల ఇంటి సమీపంలో నిల్వ చేశాడు. ధాన్యం అమ్ముకోకుండా సమ్మయ్యతో పాటు భార్య, కొడుకు అడ్డుకున్నారని ఈ నెల 7న దొనపాటి రజిత పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన ట్రైనీ ఎస్సై సుమన్‌రెడ్డి శనివారం విచారణ కోసం కన్నాపూర్‌కు వెళ్లగా సమ్మయ్య పురుగు మందు సేవించాడు. వెంటనే 108 వాహనంలో హుజూరాబాద్ ఆస్పత్రికి తరలించారు. అప్పు చెల్లించకుండా మాపై కేసు నమోదు చేశారనే మనస్తాపంతో సమ్మయ్య పురుగు మందు సేవించాడని ఆయన కుటుంబసభ్యులు రోదించారు. సమ్మయ్య పరిస్థితి విషమించడంతో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. విషయమై ఎస్సై రవిని వివరణ కోరగా రజిత ఫిర్యాదు మేరకు ట్రైనీ ఎస్సై సుమన్‌రెడ్డి విచారణకు వెళ్లగా సమ్మయ్య పురుగు మందు సేవించాడు. కేసు నమోదు కావడంతోనే విచారణకు వెళ్లారని తెలిపారు.



## జర్నలిస్టుల సంఘీభావ ర్యాలీ

కరీంనగర్‌కల్చరల్: ఉగ్రవాదాన్ని ప్రేరేపిస్తున్న పాకిస్తాన్‌ను ప్రపంచపటంలో లేకుండా చేయాలని కోరుతూ శనివారం కరీంనగర్‌లో జర్నలిస్టులు సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. టీయూడబ్ల్యూజే (ఐజేయూ) ఆధ్వర్యంలో నగరంలోని తెలంగాణ చౌక్‌లో చేపట్టిన ర్యాలీలో పలువురు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా, ఫొటో, వీడియో జర్నలిస్టులు పాల్గొన్నారు. జాతీయ జెండాలను చేతబూని భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. పహల్గాంలో 26 మంది పర్యాటకులను ఉగ్రవాదులు అన్యాయంగా పొట్టన పెట్టుకున్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గాండ్ల శ్రీనివాస్, కొయ్యడ చంద్రశేఖర్, ట్రెజరర్ గాజుల వెంకట్, ఉపాధ్యక్షుడు ఎ.శైలేందర్ రెడ్డి, జాయింట్ సెక్రటరీ పోలు సంపత్, ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ ట్రెజరర్ జి.సతీశ్, జాయింట్ సెక్రటరీ హెచ్.సంపత్, ఎస్. శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు జన్నారం శ్రీనివాస్, ఎలుగెటి శ్రీనివాస్, కంకణాల రఘు తదతరులు పాల్గొన్నారు.

## సోషల్ మీడియాలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయొద్దు



చొప్పదండి: మాట్లాడుతున్న సీఐ ప్రకాశ్ గౌడ్

చొప్పదండి: భారత్, పాకిస్తాన్ యుద్ధం నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని వర్గాల ప్రజలు సంయమనంతో ఉండాలని చొప్పదండి సీఐ ప్రకాశ్‌గౌడ్ కోరారు. చొప్పదండి పోలీస్ స్టేషన్‌లో శనివారం నిర్వహించిన శాంతి కమిటీ సమావేశంలో మాట్లాడారు. సోషల్ మీడియా పుకార్లు నమ్మొద్దని, రెచ్చగొట్టే ప్రసంగాలు ప్రచారం, ఎవరిని కించపరిచే వ్యాఖ్యలు చేయొవద్దని సూచించారు. కార్యక్రమలో ఎస్ఐలు మామిడాల సురేందర్, మనీష పీస్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

**చట్టవ్యతిరేక పోస్టులు పెడితే చర్యలు**



రామడుగు: అవగాహన కల్పిస్తున్న పోలీసులు

రామడుగు: మండలంలోని పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై రాజు, ట్రైనీ ఎస్సై సతీశ్ ఆధ్వర్యంలో శనివారం శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో సోషల్ మీడియాలో చట్ట వ్యతిరేక పోస్టులు చేయొద్దని అవగాహన కల్పించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ



ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న వైద్యసిబ్బంది

జమ్మికుంట: మండలంలోని నాగంపేట గ్రామం గంగారం చెరువు వద్ద శనివారం ఉపాధి హామీ కూలీలకు వావిలాల పీహెచ్‌సీ హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో వడదెబ్బ నిర్మూలనపై అవగాహన కల్పించారు. వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన లక్షణాలు, జాగ్రత్తలను వివరించారు. మంచినీరు, పండ్ల రసాలు, కొబ్బరి నీరు, మజ్జిగ, నిమ్మరసం వంటి ద్రవ పదార్థాలు తీసుకోవాలన్నారు. ఉదయం, సాయంత్రం వేళ పనులు చేసుకోవాలని, డీహైడ్రేషన్‌కు గురికాకుండా ఓఆర్ఎస్ ద్రావణం తాగాలని సూచించారు. అనంతరం కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎం సరిత, ఆశాలు, కూలీలు పాల్గొన్నారు.

## అవినీతిపై విచారణ చేయాలి

జమ్మికుంట: పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో జరిగిన కోట్లాది రూపాయల అవినీతిని సుమోటోగా స్వీకరించి ఈడీ కేసు నమోదు చేయాలని సామాజిక కార్యకర్త సిలివేరు శ్రీకాంత్ అన్నారు. శనివారం పట్టణంలో మాట్లాడారు. 2006 నుంచి 2025 వరకు అయ్యప్ప ఆలయం అభివృద్ధి కోసం కాటన్, రైస్‌మిల్లర్లు, భక్తుల కానుకలు, కోట్లాది రూపాయలకు సంబంధించి అవినీతి జరిగిందన్నారు. కొన్ని రోజులు వివాదాలు చోటుచేసుకున్నాయని, పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయని వెంటనే విచారణ చేయాలన్నారు.

## సన్మానం



సన్మానిస్తున్న పీఆర్‌టీయూ జిల్లా కార్యవర్గం

చిగురుమామిడి: మండలంలోని ఆయా గ్రామాల జెడ్పీపాఠశాల హెచ్‌ఎంలను పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన సమావేశంలో పదో తరగతి పరీక్షా ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులను సంఘం నాయకులు సన్మానించారు. బొమ్మనపల్లి, రేకొండ, ఇందుర్తి, నవాబుపేట్, చిన్న ముల్కనూర్, ముదిమాణిక్యం, రామంచ, సుందరగిరి, చిగురుమామిడితో పాటు కేజీబీవీకి చెందిన ప్రధానోపాధ్యాయులను శాలువాలతో సన్మానించి మెమోంటో బహూకరించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు గుండు లక్ష్మణ్‌రావు, ప్రధానకార్యదర్శి దామోదర్‌రెడ్డి, డీఈవో జనార్దన్‌రావు, జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కర్ణాకర్‌రెడ్డి, జైపాల్ రెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు దుబ్బాక బాల్ రెడ్డి, మల్లినాథశాస్త్రి, ఎంఈఓ పావని, లతో పాటు పలువురు పాల్గొన్నారు.



గోల్డ్ మెడల్స్, ప్రశంస పత్రాలతో విద్యార్థులు

గన్నేరువరం: ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన మండల టాపర్లను శనివారం కరీంనగర్‌లో పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో సన్మానించినట్లు మండల విద్యాధికారి రామయ్య తెలిపారు. మహాత్మాజ్యోతిబాఫూలే పాఠశాల విద్యార్థిని చందన 580, జంగపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని శ్రీజ 557, గన్నేరువరం ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని వందన 543 మార్కులు సాధించారు. గోల్డ్ మెడల్స్‌తో పాటు ప్రశంసా పత్రాలు అందజేశామని విద్యాధికారి తెలిపారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సీఐని సన్మానిస్తున్న బీసీ ఫోరం నాయకులు

**హుజూరాబాద్ టౌన్ సీఐకి..**

హుజూరాబాద్: హుజూరాబాద్ టౌన్ సీఐగా బాధ్యతలు స్వీకరించిన టీ.కరుణాకర్‌నుబీసీ సిటిజన్ ఫోరం ఆధ్వర్యంలో శనివారం సన్మానించా. ఈ సందర్భంగా బీసీ సిటిజన్ ఫోరం రాష్ట్ర నాయకుడు చందుపట్ల జనార్దన్, సందేల వెంకన్న మాట్లాడుతూ.... శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర ఎంతో కీలకమన్నారు. అనంతరం శాలువాలతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో హనుమాన్ దేవాలయం మాజీ చైర్మన్ ఆకుల సదానందం , బీసీ నాయకులు ఉప్పు శ్రీనివాస్, బుడిగజంగాల నాయకులు పూసపాటి వేణు, బొంగోని వెంకటయ్య, తాళ్లపల్లి అమరేందర్, గంగిశెట్టి జగదీశ్వర్, దాసరి మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.



నాగరాజు, ప్రభాకర్‌ను సన్మానిస్తున్న అజయ్‌వర్మ

**బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు,లైబ్రరీ సెక్రెటరీ**

గన్నేరువరం: కరీంనగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, లైబ్రరీ సెక్రెటరీగా ఇటీవల ఎన్నికైన మండలంలోని గునుకులకొండాపూర్, చీమలకుంటపల్లె గ్రామాలకు చెందిన లింగంపల్లి నాగరాజు, తుమ్మ ప్రభాకర్‌ను బీజేపీ నాయకుడు సొల్లు అజయ్‌వర్మ శనివారం గుండ్లపల్లిలో సన్మానించారు. బలహీన వర్గాల ఆశాజ్యోతులని అభివర్ణించారు. బార్ అసోసియేషన్ అభివృద్ధికి కృషి చేస్తూ రానున్న రోజుల్లో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు.




## ఊరంతా వెలుగులు

సాక్షి స్పందన

శంకరపట్నం: మండలంలోని కరీంపేట గ్రామ వీధుల్లో విద్యుత్ వెలుగులు విరజిమ్ముతున్నాయి. వీధిలైట్లు లేక చిమ్మచీకట్లో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారని శనివారం సాక్షిలో వాట్సాప్ కథనం ప్రచురితమైంది. సంబంధిత అధికారులు స్పందించి వీధిలైట్లు ఏర్పాటు చేయగా గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## గాలివానకు కొట్టుకుపోయిన పైకప్పు





సైదాపూర్: మండలంలో శనివారం సాయంత్రం గాలి దుమారంతో కురిసిన వానకు అపారం నష్టం వాటిల్లింది. చెట్లు విరి పడ్డాయి. ఆకునూర్‌లో నెల్లి మొగిలి ఇంటి పైకప్పు కొట్టుకుపోయింది. పలు గ్రామాల్లో గాలివాన బీభత్సానికి యాసంగి ధాన్యం రాశులు తడిసిముద్దయ్యాయి.